

‘తలనిండ పూదండ దాల్చిన రాణి..’ ఘంటసాల మధుర స్వరం సన్నగా వినిపించ సాగింది. గ్రామఫోన్ రికార్డుల ద్వారా క్యాసెట్టుల ద్వారా సిడిల ద్వారా శ్రోతలని రంజింప చేసిన అమర గాయకుడి స్వరం ఇప్పుడు సెల్‌ఫోన్ రింగ్ టోన్‌గా కొత్త అందాలను సంతరించుకుంది.

అయితే టీవీ ఎదురుగా సోఫాలో సగం కూర్చుని సగం జారబడిన భంగిమలో నిద్ర పోతున్న సూర్యానికి కొద్ది క్షణాల తరువాత కాని సెల్ పంపిస్తున్న సంకేతాలు అందలేదు.

మెలకువ రాగానే అప్రయత్నంగా చేతిలో ఉన్న రిమోట్‌ని చెవి దగ్గర చేర్చి హలో అన్నాడు. అంతలో చేసిన పొరపాటు గ్రహించి సెల్ అందుకున్నాడు... ఈ సమయంలో ఎవరు ఫోన్ చేశారా అన్న కంగారుతో గొంతు వణికింది. ‘హ..హలో..లో !’ అన్నాడు సూర్యం.

‘నేనురా ! భాస్కర్‌ని’ పన్నెండు గంటల సమయ భేదాన్ని కొన్ని వేల కిలో మీటర్ల దూరాన్ని దాటి వినబడుతున్న స్నేహితుడి స్వరం సూర్యంలో అయోమయాన్ని ఇంకాస్త పెంచింది.

‘భాస్కర్ ! ఎలా ఉన్నావు ?’ తడబడుతూ అడిగాడు సూర్యం.

భాస్కర బోలుగా నవ్వాడు. ‘మనసు బాగా లేదురా..అందుకనే నీకు ఫోన్ చేశాను’

భాస్కర్ సూర్యం కాలేజీలో స్నేహితులు.

# వాళ్లిద్దరూ గోర్కీ


## శ్రీఉదయిని

చదువు అయ్యాక ఉద్యోగాల వల్ల దూరంగా ఉన్నా రిటైర్ అయ్యాక ఇద్దరూ ఒకే కాలనీలో స్థిరపడ్డారు. సూర్యం పిల్లలు ఇద్దరూ ఇండియాలోనే ఉంటున్నారు కానీ భాస్కర్ ఒక్కగాని ఒక్క కొడుకు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పని చేస్తున్నాడు.

రెండేళ్ళ క్రితం భాస్కర్ భార్య పోయింది. అప్పుడు ఇండియాకి వచ్చిన భాస్కర్ కొడుకు తాను ఓ ఇటాలియన్ అమ్మాయిని పెళ్ళి చేసుకోబోతున్నట్లు తండ్రికి చెప్పాడు.

‘ఏడాది నుంచి నేను సంబంధాలు చెబుతుంటే ఏదో ఒక వంక పెట్టేవాడు..అసలు సంగతి అదన్న మాట! ఇప్పుడు చల్లగా ఎవరో తెల్ల తోలు అమ్మాయిని పెళ్ళి చేసుకుంటానన్న బాంబు పేల్చాడు.. ఏం చేయాలి ?.. నేను కాదన్నా ఔనన్నా వాడి ఇష్టం వచ్చినట్లు వాడు చేసుకుపోతాడు. అందుకనే సరే అన్నాను’ అని ఆ తరువాత సూర్యం దగ్గర బాధపడ్డాడు భాస్కర్. ‘ఇప్పుడు చూడు తల్లి పోయిన మూడు నెలలకే పెళ్ళి అంటున్నాడు.. అయితే అక్కడే చేసుకో అన్నాను.. చర్చ్‌లో పెళ్ళిట.. అంతోటి భాగ్యానికి నేను రాలేను అని కూడా చెప్పాను’ అన్నాడు భాస్కర్. అంతే కాదు, ఆ తరువాత కొడుకుతో ముభావంగా ఉండటం క్లుప్తంగా మాట్లాడి ఫోన సంభాషణని తుంచేయడం మొదలు పెట్టాడు. అయినా అతని కోపం ఎక్కువ రోజులు నిలవలేదు. ఎప్పటినుంచో భాస్కర్‌ని అమెరికా రమ్మనమని కొడుకు అడుగుతుండేవాడు. చివరికి తనకి పూర్తిగా అర్థం అవని యాక్సెంట్‌లో కోడలు కూడా ఆహ్వానించాక భాస్కర్ ఒప్పుకున్నాడు. అతను అమెరికా వెళ్ళి రెండు వారాలు అవుతున్నది.. ఆ దేశంలో కాలు పెట్టగానే ఫోన్ చేశాడు.. తిరిగి మళ్ళీ ఇప్పుడు.. అదీ అర్ధరాత్రి సమయంలో..

‘ఏమయింది భాసూ! ఏమయింది ?’ ఆతృతగా అడిగాడు సూర్యం.



'నిన్న రాత్రి సరిగ్గా నిద్ర రాలేదు.. అలా పక్క పైనే దొర్లుతూనే రాత్రంతా గడిపాను.... నీకు ఫోన్ చేయబోయి కూడా నోరు విప్పే సత్తువ లేనట్లు అనిపించి ఆగాను.. ఇప్పుడు నువ్వు మంచి నిద్రలో ఉంటావని తెలుసు.. నీ నిద్ర చెడగొట్టటం భావ్యమా అని సందేహించాను.. అంతలో మన హాస్టల్ రోజులు గుర్తుకు వచ్చాయి.. ఓ రాత్రి నేను గుర్రు పెట్టి పడుకుని ఉంటే నువ్వు నా గది తలుపు కొట్టి నన్ను లేపావు....గుర్తుందా ? నిక్షేపంలాంటి నా నిద్ర చెడగొట్టావు ఆ రోజు..'

సూర్యానికి గుర్తు రాలేదు.

అటు నించి భాస్కర్ మాట్లాడుతూనే ఉన్నాడు. 'నలభై ఏళ్ళ క్రితం నాటి ఆ బాకీ వసూలు చేయాలనిపించింది. వెంటనే ఆలోచించకుండా నీకు ఫోన్ చేశాను' భాస్కర్ నవ్వాడు.

సూర్యం ఆవలించాడు. ఆ ఆవలింత ఖండాలని దాటుకుని భాస్కర్ చెవులని చేరుతుందని అతనికి తెలుసు.

భాస్కర్ మళ్ళీ నవ్వాడు.'ఆహా! ఆ ఆవలింత వింటుంటే నాకు చాలా సంతృప్తిగా ఉంది... మంచి నిద్రలో లేపాను కదూ?'

సూర్యంకి ఇంకా గందరగోళంగానే ఉంది. 'భాసూ ! ఏమయిందిరా?'

'ఏం చెప్పను?... చాలా అయింది.. ముఖ్యంగా నా మనసు బాగోలేదు..పైగా ఎక్కడో పరాయి దేశంలో ఏకాకిగా ఉన్నాను కదా..'

'ఏకాకి అంటావేమిటీ?.. ఎంచక్కా కొడుకు కోడలు ఉన్నారుగా!'

భాస్కర్ అదోలా నవ్వాడు. 'వాళ్ళకి దగ్గరగానే ఉన్నా ఎందుకో దూరంగా ఉన్నానన్న భావన కలుగుతున్నదిరా'

పాపం అనుకున్నాడు సూర్యం.

'నేను ఇంకో పది నిముషాల తరువాత ఫోన్ చేస్తాను.. ఈ లోగా మొహం కడుక్కుని నా బాధ వినటానికి తయారుగా ఉండు'

'ఓకే!' అన్నాడు సూర్యం.

అతని భార్యం గీత నిద్రమాత్రలు వేసుకోవటం వల్ల కాబోలు గాఢ నిద్రలో ఉంది. అంత వరకూ భాస్కర్‌ని అంతగా కుదుపుతున్న సమస్య ఏమిటా అని ఆలోచిస్తున్న సూర్యానికి తమ సమస్యలు చప్పున గుర్తుకి వచ్చాయి..ఎప్పుడూ వాటినే తలపోయటం వల్ల సూర్యం భార్యకి సరిగ్గా నిద్ర పట్టేది కాదు.. దాంతో మందులు వాడక తప్పటంలేదు.

టవల్ అందుకుని బాత్రూమ్ లోకి నడిచాడు సూర్యం. దగ్గరగానే ఉన్నా దూరంగా ఉన్నానన్న భావనట!...ఎంత బాగా చెప్పాడు భాస్కర్ అనుకున్నాడు. దాదాపుగా తనదీ అదే రకమైన సమస్య కదా!

సూర్యం దంపతులకి ఇద్దరు పిల్లలు...ఇద్దరు మనవరాళ్ళు..ఇద్దరు మనవళ్ళు.. కొడుకూ కోడలూ, కూతురూ అల్లుడు వేరు వేరు రాష్ట్రాలలో ఉన్నా వారానికి రెండు మూడు సార్లు ఫోన్లు చేస్తూనే ఉంటారు. నెలకో ఎప్పుడో కుదిరినప్పుడో మూడో తరం వారు పలకరిస్తూనే ఉంటారు.. అంతా బాగానే ఉన్నట్లు పైకి కనిపిస్తుంది కానీ పిల్లలకి అయిదారేళ్ళు దాటాక ఇప్పుడు సెలవులకి వాళ్ళెవరూ సూర్యం దంపతుల దగ్గరికి రావడం లేదు..వచ్చినా మొక్కుబడిగా ఒకట్రెండు రోజులు ఉండి వెళ్ళిపోతున్నారు.

అది గీత భరించలేకపోతున్నది. చివరికి ఓ సారి కూతురిని నిలదీసింది కూడా. అప్పుడు కూతురు 'అమ్మా! వాళ్ళకి ఇక్కడ ఎలా టైమ్ పాస్ అవుతుంది చెప్పు? మీ ఇంటి దగ్గర వాళ్ళ ఈడు పిల్లలు లేరు..కంప్యూటర్ లేదు.. నెట్ లేనిదే వాళ్ళకి ఊపిరాడినట్లు ఉండదు తెలుసా? అని క్లాసు తీసుకుంది. కూతురు నిజమే చెప్పింది అని గీతకు కూడా తెలుసు.'కానీ ఇదేమి చోద్యం అండీ.. కంప్యూటర్ లేకపోతే కామిక్స్‌తో సరిపెట్టుకోవచ్చు కదా! తాతయ్యా! నువ్వు అన్నీ ఓల్డ్ స్టోరీస్ చెబుతావు అని చెవులు మూసుకుని పారిపోవటం మర్యాద కాదని మనపిల్లలయినా వాళ్ళకి బుద్ధి చెప్పటం మాని ఉల్టాగా వాళ్ళకి కావాల్సిన సౌకర్యాలు అందివ్వకపోవటం మనదే తప్పు అని అంటున్నారేమిటి?' అని సూర్యం దగ్గర గోడు వెళ్ళబోసుకుంది గీత.

సూర్యం మాత్రం ఏం సమాధానం చెబుతాడు?

క్రమంగా ఫోన్లలో పరామర్శించుకోవటమే కాని పిల్లల దర్శన భాగ్యం కరువవసాగింది. ఎప్పుడూ దాని గురించే ఆలోచిస్తూ గీత మనస్థిమితం కోల్పోయింది. పైగా అదే సమయానికి డివోషనల్ ఛానెల్స్ కుప్పలు తెప్పలుగా ప్రత్యక్షమయ్యాయి. అంత వరకు టివి అంటే ఎక్కువగా ఆసక్తి చూపని గీత ఉదయం నుండి రాత్రి పడుకునే వరకు ఏదో ఒక భక్తి సంబంధమైన కార్యక్రమం చూస్తూ కాలం గడపసాగింది. ముందునించీ సూర్యానికి ఆధ్యాత్మికత అంటే పడదు..సరే భార్య అభిరుచికి ఎందుకు అడ్డు పడాలని రిమోట్ పైన సర్వ అధికారాలు ఆమెకే ఇచ్చాడు. అతనికి చర్చా కార్యక్రమాలు ఇష్టం...వాటిని అర్ధరాత్రి సమయంలో రిపీట్ చేసినప్పుడు చూడటం అలవాటు చేసుకున్నాడు.

అయినా గీత మధన పడుతూనే ఉంది. ఏం చేస్తే ఆమెకి మనశ్శాంతి దొరుకుతుందో సూర్యానికి అంతు పట్టటం లేదు...

సూర్యం మొహం కడుక్కుని వచ్చి హాల్‌లో కూర్చున్నాడు.

సూర్యం, భాస్కర్ నలభై ఏళ్ళ క్రితం యూనివర్శిటీ ఇంజినీరింగ్ కాలేజీలో కలిశారు. చదువయ్యాక వేరు వేరు రాష్ట్రాలలో ఉద్యోగాలు రావటంతో ఆ అయిదేళ్ళ స్నేహానికి దీర్ఘ విరామం వచ్చింది. మధ్య మధ్యలో చాలా అరుదుగా కలుసుకున్నారు. ఉద్యోగంలో ఉండగానే సూర్యం ఇల్లు కట్టుకున్నాడు. అదేకాలనీలో ప్లాటు తీసుకున్న భాస్కర్ రిటైర్ అయ్యాక ఇల్లు కట్టాడు. ఆ విధంగా తిరిగి వాళ్ళ స్నేహం కొనసాగింది.

'ఒరేయ్! అప్పుడు నువ్వు ఈ పాటను ఎంతో లైక్ చేసేవాడివి కదరా' అంటూ భాస్కర్ తలనిండ పూదండ పాటను సూర్యం సెల్‌లో రింగ్‌టోన్‌గా పెట్టాడు.

'స్ట్రెంత్ ఆఫ్ మెటీరియల్స్ పరీక్ష ముందు ఈ నవల లీనమయి చదివావు .. ఎగ్జామ్ తన్నేశాక అందరూ తిడుతుంటే లేదురా కొమ్మూరి బ్రహ్మాండంగా రాశాడు అన్నావు. నేను ఎప్పటికీ మరిచిపోలేను.. ఇదుగో మొన్న ఆబిడ్స్‌లో కనబడింది..' అంటూ సూర్యం మళ్ళీ ఎప్పుడో ఎక్కడో..నవలని భాస్కర్‌కి ఇచ్చాడు.

ఉద్యోగాలలో గడిపిన ముప్పయి అయిదేళ్ళ జీవితం కంటే కాలేజీలో కలిసి అనుభవించిన అయిదేళ్ళ బంగారు రోజుల గురించి పదే పదే జ్ఞప్తి చేసుకోవటం వాళ్ళకి చాలా ఇష్టమైన విషయంగా మారింది. క్లాసుమేట్స్ కలుసుకున్నప్పటి నుండీ పోస్ట్ రిటైర్మెంట్ జీవితాలలో సందడి పెరిగింది. అలా ఓ రెండేళ్ళు గడిచాయో లేదో భాస్కర్ భార్యకి క్యాన్సర్ అని తెలిసింది. సర్జరీలు, కీమోథెరపీలు ఆవిడ ప్రాణాలు కాపాడలేకపోయాయి.

భార్య మరణం భాస్కర్‌ని బాగా కుదిపివేసింది. మనిషిలో ఆధ్యాత్మికత బాగా పెరిగింది. నాన్ వెజ్ తినటం మానేశాడు. స్వామీజీల ప్రవచనాలకి వెళ్ళటం మొదలుపెట్టాడు. అది వరకు కంటే మతం పైన గౌరవం గురి పెరిగాయి..మన పెద్దవాళ్ళు ఊరికే ఇలాంటి నియమాలు పెట్టలేదోయ్ అని అనటం మొదలుపెట్టాడు.

సూర్యం పక్కా రేషనలిస్ట్..ఇంకో సందర్భంలో భాస్కర్ అలా ప్రవర్తిస్తే ఊరుకునే వాడు కాదు కాని భాస్కర్ గుండెలలో ఎంత గాఢంగా విషాదం గూడు కట్టుకుందో తెలుసు కాబట్టి సంబాళించుకున్నాడు. అప్పటికీ సూర్యం గీత దగ్గర వాదిస్తూ ఉండేవాడు. ' ఈ వేదాంతాలు, ఆధ్యాత్మికతా భావాలు అవసరమైనప్పుడు మనిషికి మనశ్శాంతి ఇస్తాయని అందరూ అంటుంటారు కాని అది శుద్ధ భ్రమ! ఎందుకంటే అవి కలిగించేవి తాత్కాలిక ఉపశమనం మాత్రమే ! దేవుడు ఉన్నాడు మనల్ని ఆదుకుంటాడు అన్నది ఆశాభావాన్ని కలిగించినా ఇంకో జన్మఉందని అప్పుడూ ఇలాంటి విపత్కర స్థితి అనుభవించకూడదు అన్న తాపత్రయం ఆటోమేటిక్‌గా పెరుగుతుంది కదా! దాంతో కలిగేది అశాంతే.. మనిషికి మిగిలేది అలజడే ! .. అందుకనే హేతువాదం బెస్ట్!' అని అంటుండే వాడు. స్నేహితుడి గురించి చెబుతున్నట్లు నటిస్తూ భార్యకి హితోపదేశం చేయటానికి ప్రయత్నించేవాడు. 'ఏమో! అలా అని మీలాంటి ఉలిపి కట్టెలు అనుకోవాల్సిందే!' అని ఒక్క ముక్కలో తీర్పు ఇచ్చేది గీత.

ఇంకా భాసూ ఫోన్ చేయలేదేమిటీ అని అనుకుంటుంటే సూర్యానికి భాస్కర్ ప్రస్తావించిన రాత్రి ఏమిటో గుర్తుకి వచ్చింది.

భాస్కరానిది కుంభకర్ణ నిద్ర. హాస్టల్‌లో ఆ రాత్రి సూర్యం చాలా సేపు ప్రయత్నిస్తే కాని భాస్కర్ నిద్ర మంచం వదిలి తలుపు తీయలేదు 'ఏమిట్రా ఏమిటీ గోలా ?' అన్నాడు భాస్కర్ చిట్లించి చిరాగ్గా చూస్తూ.

సూర్యం వెంటనే జవాబివ్వలేదు. చేతిలో ఉన్న పుస్తకాన్ని టేబుల్‌పైన ఉంచి కూజా అందుకుని మంచి నీళ్ళు తాగాడు. ఆ తరువాత నోరు విప్పాడు. 'రేయ్ ! ఈ పుస్తకం చదువుతుంటే నాకు నిద్ర రాలేదురా..' అన్నాడు ఆ పుస్తకాన్ని చూపిస్తూ.

భాస్కర్ దిండు కింద ఉన్న బూతు పుస్తకాన్ని ఆప్యాయంగా నిమిరి 'నాకూ అంతేనురా' అన్నాడు.

సూర్యానికి ఆవేశం ముంచుకు వచ్చింది. దిండు కింద ఉన్న పుస్తకాన్ని తీసి నేలకి వేసి కొట్టాడు. 'సాహిత్యం అంటే ఇదిరా' అంటూ క్లాసులకి నామం పెట్టి తను చదువుతూ ఉండిపోయిన గోర్కీ రాసిన మదర్ పుస్తకాన్ని పైకెత్తాడు.

'రేయ్ ! ఆ లైన్ చదివితే నాకు లైవ్ వైర్ ముట్టుకున్నట్లు షాక్ కొట్టిందిరా. ఆ ఒక్క వాక్యాన్నే మళ్ళీ మళ్ళీ చదువుతూ ఉండిపోయాను.. అబ్బా! ఏం చెప్పాడురా! సినిమాలలో దేవుడు ప్రత్యక్షమయ్యేటప్పుడు ఓ మ్యూజిక్ వినిపిస్తారు కదా ఆ ప్రశ్నా ఆ జవాబు చదివాక నా బుర్రలో పేద్ద వాల్యూమ్‌తో ఆ సంగీతం వినబడినట్లయింది. నరనరాలలో ట్వెల్వ్ కెవి కరంట్ జలజలా పరిగెత్తినట్లయింది..' సూర్యం ఉపన్యాస ధోరణిలో చెప్పుకుపోయాడు.

'ప్రశ్నేమిటీ? జవాబేమిటీ? ట్వెల్వ్ కెవి కరంటేమిటీ? నువ్వు చదువుతున్నది నవలా లేకపోతే కాటన్ రాసిన ఎలక్ట్రికల్ టెక్నాలజీనా?' అయోమయంగా అడిగాడు భాస్కర్.

ఆవేశం తగ్గించుకున్నాడు సూర్యం. మెల్లగా వివరించసాగాడు. అతను క్రితం రోజు లైబ్రరీ నుంచి మదర్ పుస్తకం తెచ్చుకున్నాడు. ఆ తరువాత ఏకాగ్రతగా చదువుతూ ఉండిపోయాడు. పధ్నాలుగో ఛాప్టర్‌లో ఓ సన్నివేశం చదువుతూ సూర్యం ఉద్రిక్తుడయ్యాడు.

అమ్మ ఇంట్లో అందరూ కలిసి చర్చిస్తూ ఉంటారు. మధ్యలో ఒకడు 'మనం ఉన్న ఈ దౌర్భాగ్య పరిస్థితికి కారణం ఎవరు? జార్ చక్రవర్తా?' అన్న ప్రశ్న వేస్తాడు. 'కాదు.. ప్రపంచం ఈ దుస్థితిలో ఉండటానికి మూల కారకుడెవరో తెలుసా?.. ఇది నాది అని ప్రప్రథమంగా ప్రకటించిన స్వార్థపరుడి వల్లనే ఇప్పుడు మనం ఈ కష్టాలన్నీ అనుభవిస్తున్నాం' అన్న జవాబు లిటిల్ రష్యన్ అన్న పాత్ర ద్వారా వస్తుంది.

ఆ ప్రశ్నా జవాబూ చదువుతుంటేనే సూర్యం అనూహ్యంగా స్పందించాడు. ఆ అక్షరాలని దాటి వెళ్ళలేనట్లు అతని కళ్ళు పదే పదే అవే లైన్లని చదువుతూ ఉండిపోయాయి..మెదడు పని చేయటం మానేసినట్లయింది.

పుస్తకాన్ని అందుకుని సూర్యం చూపించిన పేరాలు చదివిన భాస్కర్‌కి కూడా నిద్రమత్తు వదిలింది. 'అవున్రా ! చాలా అద్భుతంగా రాశాడు' అతనికి తెలియదు కానీ అతను కూడా ఆ సంభాషణని మళ్ళీ మళ్ళీ చదువుతున్నాడు

వాళ్ళిద్దరూ చాలా రోజులు ఆ నవల గురించి చర్చించేవాళ్ళు. దాదాపు అప్పటి రష్యా పరిస్థితుల లోనే ఇప్పుడు మన దేశం ఉంది అనే వాడు సూర్యం.

సెల్‌ఫోన్ మోగటంతో నలభైయేళ్ళ క్రితం నాటి జ్ఞాపకాల నుంచి బయటపడ్డాడు సూర్యం. 'గోర్కీ ఇప్పటికైనా గుర్తుకు వచ్చాడా ?' భాస్కర్ అడిగాడు.

'గోర్కీని గుర్తు చేసినందుకు థ్యాంక్స్ గానీ అసలు సంగతేమిటో చెప్పు..అబ్బాయితో నువ్వేం గొడవ పడలేదు కదా ?' సూర్యం అడిగాడు

'ఛా! అలాంటిదేమీ లేదు' భాస్కర్ నిట్టూర్చాడు. మెల్లగా చెప్పసాగాడు.

వెళ్ళిన మొదటి రోజే 'నాన్నా! నాతో ఏం మాట్లాడాలన్నా ఇంగ్లీషులోనే మాట్లాడు. జెనిఫర్ ఎదురుగా ఆమెకి అర్థం కాని భాషలో సంభాషణ నడవటం మ్యానర్స్ కాదు కదా' అన్నాడు కొడుకు.

నిజమే కదా అనుకుని ఆ సూచనని తూచా తప్పకుండా పాటించసాగాడు భాస్కర్.

వారం రోజులు గడిచాయి.

భార్య పుట్టినరోజు దగ్గర అవుతూ ఉండటంతో ఆ రోజున ఏం చేయాలా అన్న ఆలోచనలో పడ్డాడు భాస్కర్ . నేను పోయాక గోదానం తప్పకుండా చేయండి నాకు సద్గతులు కలుగుతాయట అని భార్య అన్న మాటలు ఇంకోసారి గుర్తుకి వచ్చాయి అతనికి. ఆ రోజున గోపూజ చేసే అవకాశం ఉంటుందా అని కొడుకుని కనుక్కోవాలనుకున్నాడు.

'ఇక్కడ ఆవులు దొరుకుతాయా' అని తెలుగులో ఆలోచించి డైనింగ్ టేబుల్ దగ్గర ఇంగ్లీషులో 'ఆర్ కౌస్ ఎవలయిబుల్ హియర్ ?' అని ప్రశ్నించాడట.

కొడుకుకి సరిగ్గా అర్థం అవలేదుట కానీ కోడలు ఇంకో విధంగా అర్థం చేసుకుని 'డూ యూ వాంట్ టూ ఈట్ బీఫ్? ఇట్స్ ఇన్ ద డీప్ ఫ్రీజర్ అందిట.

'అప్పుడు ఆ నోట్లో ఉన్న బ్రెడ్డు ముక్కని మింగలేకా, కక్కలేకా నానా అవస్థా పడ్డానురా..ఇప్పుడు మానేశాను గానీ చిన్నప్పటి నుండి చికెన్ మటన్ తింటూనే వచ్చాను.. కాని మనం పవిత్రంగా భావించే గోమాతనా?.. ఇక ఆ రోజు నుండి వాళ్ళతో కలిసి భోజనం చేయలేకపోతున్నాను..ఫ్రిజ్ తలుపు తీయాలంటే భయంగా ఉంది..' అంటూ భాస్కర్ తన వేదన వెలిబుచ్చాడు.

కవిత


## నానీలు



**1. పువ్వు**
నిస్వార్థ జీవి
పరిమళం అందించి రాలిపోతుంది



**2. వెన్నెల**
నా ఊహల కల
ఎప్పుడూ చెదిరిపోతూనే ఉంటుంది



**3. కోకిల**
పాపం పిచ్చిపిల్ల
తన పాటలు ఇప్పుడు ఎవరు వింటున్నారని



**4. కాకి**
కోకిలను ఏకాకిని చేసింది
ఇంకేముంది కొత్త గాయకులను తయారుచేసింది



**5. మా ఊరు**
అమాయకంగా నవ్వే సెలయేరు
గ్లోబలైజేషన్ వరదలో కొట్టుకొని పోయింది.

–శ్రీరామదాసు అమరనాథ్
**96033 67178**

సూర్యంకి ఏం చెప్పాలో తోచలేదు 'ఇలాంటివి ఉంటాయని నీకు ముందే తెలుసు కదా !

'తెలుసు..కాని మా అబ్బాయి కూడా..'భాస్కర్ మధ్యలో ఆగిపోయాడు.

సూర్యానికి కొద్దిగా అర్థమైంది. భార్య మరణం భాస్కర్‌ని చాలా సెంటిమెంటల్‌గా మార్చింది. భార్య పోయాక దాదాపు ప్రతి పుణ్యక్షేత్రం లోను అతను గో పూజలు చేశాడు.

'నా మాటలు కోడలికి ఏం అర్థమయ్యాయో ఏమిటో..రేపు ఎప్పుడన్నా నాకు వడ్డిస్తుందేమో కూడా.. అందుకనే ఆరు నెలలు ఆగకుండా కుదిరినంత త్వరగా వచ్చేయాలని ఉంది'

'అలాంటి పిచ్చిపని చేయకు' సూర్యం టక్కున అడ్డు తగిలాడు'అబ్బాయి నొచ్చుకుంటాడు..'

'మరి నన్ను ఎలా ఉండమంటావు?'

సూర్యం దగ్గర సమాధానం లేదు. అయినా మిత్రుడిని సముదాయించే ప్రయత్నం చేశాడు.

పావుగంట మాట్లాడాక భాస్కర్ అన్నాడు 'థ్యాంక్స్ రా ! నీతో కబుర్లు చెప్పాక కొంచెం మనసు స్థిమిత పడ్డట్టు ఉంది'

బై చెబుతూ ఇంకోసారి మిత్రుడికి ధైర్యం చెప్పాడు సూర్యం.

నాదో రకమైన సమస్య..భాస్కర్‌ది వేరే విధమైన సమస్య అనుకున్నాడు సూర్యం. అతనికి చాలా సేపటివరకూ నిద్రపట్టలేదు. ఆ కలత నిద్రలో కూడా ఏవేవో అర్థం లేని కలలు అతన్ని సతాయించాయి. భాస్కర్‌కి ఎలాగూ పరిష్కారం సూచించలేను మేమేం చేయాలో ఆలోచించాలి అనుకున్నాడు.

నాలుగు రోజుల తరువాత మళ్ళీ భాస్కర్ ఫోన్ చేశాడు.

'ఈ సారి చాలా సివిలైజ్డ్ టైమ్‌లో ఫోన్ చేశాను కదా?' భాస్కర్ నవ్వాడు. ప్రశాంతత వల్ల పుట్టే నవ్వు అది. అమ్మయ్యా భాస్కర్ కుదుట పడ్డాడు అనుకున్నాడు సూర్యం.

'అప్పుడు నీ పోరు పడలేక మదర్ నవల కొన్ని పేజీలు చదివాను..ఆ తరువాత నా వల్ల కాలేదు.. మొన్న నీతో మాట్లాడాక మా అబ్బాయితో చెప్పి ఆ పుస్తకం తెప్పించుకున్నాను. సరిగ్గా నీకు షాక్ కొట్టిన పద్నాల్గో ఛాప్టర్ దగ్గరే నేనూ ఆగిపోయాను' భాస్కర్ అన్నాడు. 'ఇది నాది అని ఒం ప్రథమంగా ప్రకటించిన వ్యక్తే మానవజాతిని భ్రష్టు పట్టించి స్వార్థచింతనలో పడేసిన దుర్మార్గుడు అని జడ్జ్‌మెంట్ ఇచ్చాక ఇంకో వాక్యం వస్తుంది...ఆ దుర్మార్గుడు చచ్చిపోయి కొన్ని వేల ఏళ్ళు గడిచాయి. వాడిని ద్వేషించి ఏం లాభం అన్నది ఆ వాక్యం. అది చదివాక నాకు చిన్న సైజ్ జ్ఞానోదయం కలిగింది'

'ఏమిటా జ్ఞానోదయం?' సూర్యం కుతూహలంగా అడిగాడు.

'ఇది నాది అని అనుకోవటమే ఒరిజినల్ పాపం అని తెలుసుకున్నాక కూడా అదే దారిలో మనం ఎందుకు వెడుతున్నాం? వేల సంవత్సరాలుగా అలవాటయింది కాబట్టి. అవునా?'

పూర్తిగా కాకపోయినా ఆ మాటలు కాసింత సబబుగా కనబడటంతో సూర్యం 'అవును' అన్నాడు.

'అలాంటప్పుడు వేల సంవత్సరాలుగా మనిషికి అలవాటయిన మాంస భక్షణని అసహ్యించుకోవటం తప్పు కదా అని నాకు తోచింది'

'ఎక్సలెంట్!' స్నేహితుడు సమాధాన పడ్డాడు కదా అన్న సంతోషంతో అన్నాడు సూర్యం. స్నేహితుడి లాజిక్‌లో లోపాలని పట్టించుకునే సమయం అదికాదు అని అతనికి తెలుసు.

'నేను తినకూడదు అని నిర్ణయించుకున్నాను. అది పాటిస్తాను కాని వేరే వాతావరణంలో ఉంటున్న నా కొడుకూ కోడలూ కూడా అలాగే ఉండాలనుకోవటం అవివేకం కదా..అలా ఉండరని బాధపడటం వల్ల లాభం ఏముంది ?'

'బాగా చెప్పావు' అన్నాడు సూర్యం ప్రోత్సహిస్తున్నట్లు.

'అంతేకాదు..ఇంకో శుభ వార్త కూడా ఉంది. ఇప్పుడు మా కోడలు పిల్ల నన్ను ఏఏ ఊర్లు తిప్పుతుందో ఓ ప్రోగ్రామ్ కూడా తయారు చేసింది.ఇక కొన్ని రోజులు నాకు తీరిక కూడా ఉండదు' భాస్కర్ అన్నాడు.

'శుభం' అంటూ తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు సూర్యం.

అతను ఫోన్ పెట్టేశాక 'ఏమిటీ శుభం అంటున్నారు?' అతని భార్య గీత అడిగింది. అలా అడిగింది కాని ఒక కంటితో టీవీని చూస్తూనే ఉంది.

భాస్కర్ కథ అంతా చెప్పాడు సూర్యం.

సూర్యం టూకీగా చెప్పటం వల్లనో లేక టీవీలో వస్తున్న ప్రబోధాన్ని కూడా అదేసమయంలో వినే ప్రయత్నం చేయడం వల్లనో భాస్కర్ కథలో సూర్యం చెప్పని అర్థం గీతకి స్ఫురించింది' ఆయనకి ఆ ఇంగ్లీషు పుస్తకం చదివితే పరిష్కారం కనబడిందా?' అని సాలోచనగా అంది' ఆ పుస్తకంలో అంత మహత్యం ఉందా?'

సూర్యంలోని రేషనలిస్ట్ మహోగ్రంగా ఉపన్యాసం ఇవ్వడానికి సంసిద్ధుడయ్యాడు. అంతలోనే సూర్యం సంబాళించుకున్నాడు. స్వరాన్ని సాధ్యమైనంత మెత్తగా మార్చి ఎదురుగా టీవీలో కనబడుతున్న స్వామీజీ లాగా మొహం పెట్టి అన్నాడు.

'నేను ఆ పుస్తకాన్ని దాదాపుగా బట్టీ పట్టాను. మహత్యం అని కాదు కాని అందులో విషయాలు గుర్తు చేసుకుంటుంటే నాకు కూడా ఓ అద్భుతమైన ఐడియా తట్టింది..'

గీత మొహం వికసించింది. 'ఏమిటా ఐడియా?'

ఆమె మొహంలో కనబడ్డ ఆనందపు ఛాయలు చూస్తుంటే అతని బుర్ర పాత ఐడియాలకి ఇట్టే బ్రహ్మాండమైన మెరుగులు దిద్దేసింది. 'మన మనవళ్ళకి మనవరాళ్ళకి ఇక్కడ ఎందుకు తోచటం లేదు ?..నెంబర్ వన్..కంప్యూటర్ లేదు. ముప్పయి నలభై వేలు పోసి కంప్యూటర్ కొనటం ఎందుకు అనుకుంటున్నాం కదూ..కాని నెలకి మూడొందలకో ఐదువందలకో కంప్యూటర్లు అద్దెకి ఇస్తారుట.. వాళ్ళు ఉన్నన్ని రోజులూ తీసుకుంటే సరి !'

'ఇది బాగుంది' రిమోట్‌తో స్వామీజీని మ్యూట్ చేసి అంది గీత.

'నెంబర్ టూ... వాళ్ళు ఇక్కడికి వచ్చినప్పుడు మనం ఏం చేశాం?.. మన పిల్లలు వాళ్ళ చిన్నతనంలో ఇష్టపడ్డ అమర్ చిత్ర కామిక్స్ బోలెడు కొని ఇప్పటి తరం వాళ్ళకి ఇచ్చాం.. అవి వాళ్ళకేం నచ్చుతాయి? దాంతో మన ఇంటికి రావాలంటే భయపడుతున్నారు'

'మరి మనం ఏం చేయాలి?'

'నువ్వు నేనూ తీరిక గానే ఉన్నాం కదా... ఈ టీవీలు గివీలు మానేసి హారీ పోటర్ పుస్తకాలు చదవడం మొదలు పెడదాం...ఇంటర్‌నెట్ అంటే ఏమిటో తెలుసుకుందాం..క్రికెట్ రికార్డులు బట్టీ పట్టేద్దాం..ఈ సెలవలకి మనవళ్ళు మనవరాళ్ళూ వచ్చే సరికి వాళ్ళకి నచ్చే విధంగా మనం మసిలితే ఇంకో వారం రోజులు ఇక్కడే ఉందాం అని వాళ్ళు అనకపోతే చూడు'

గీత టీవీ ఆపేసింది.

*

సి.పి.బ్రౌన్ అకాడమీ-నవ్య వీక్లి నవలల పోటీలో
ప్రత్యేక బహుమతి పొందిన నవల
డా. కాలువ మల్లయ్య
చీకట్లో చిరుదీపం
వచ్చేవారమే ప్రారంభం